తెలంగాణ రాష్ట్రప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా, అద్భుతంగా నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం వైపు నుంచి మంగళవారం వెళ్తున్న ప్రధాని మోదీ కాన్వాయ్. ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన బీజేపీ ఎన్నికల ప్రచార సభలో పాల్గొనేందుకు ప్రధాని ఈ మార్గం గుండానే వెళ్లారు.

బీసీల బంధువు బీఆర్ఎస్

- బడుగువర్గాలను అక్కున చేర్చుకొన్న ముఖ్యమంత్రి కేసీఆర్
- బీసీలకు ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, కార్పొరేషన్ చైర్మన్లు, ఇతర పదవుల్లోనూ ప్రాధాన్యం
- రాజ్యాధికారమేకాదు సాధికారతలోనూ అందలం
- బీసీ, చేతి వృత్తుల కోసం ఉచితంగా 'లక్ష' సాయం
- కునారిల్లిన కులవృత్తులకు స్వరాష్ట్రంలో జీవం
- ఇంత చేసినా బీఆర్ఎస్ బీసీ ద్రోహి అంటూ బీసీ ఆత్మగౌరవ సభలో ప్రధాని మోదీ దుష్ప్రచారం

సమైక్య పాలనలో కునారిల్లిన బీసీ కులవృత్తులకు స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ జీవం పోశారు. ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, కార్పొరేషన్ చైర్మన్లతోపాటు ఇతర పదవుల్లోనూ బీసీలకు పెద్దపీట వేశారు. రాజ్యాధికారమే కాదు సాధికారతలోనూ అందలం ఎక్కించారు. బీసీ, చేతి కులవృత్తుల కోసం ఉచితంగా లక్ష సాయం అందించే బీసీ బంధుకు శ్రీకారం చుట్టారు. బీసీ కులాలకు సంఘభవనాలు నిర్మిస్తూ వారి ఆత్మగౌరవాన్ని కాపాడారు. బీసీలకోసం ఇంత చేసిన బీఆర్ఎస్, సీఎం కేసీఆర్‌పై హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన బీసీ ఆత్మగౌరవ సభలో ప్రధాని నరేంద్ర మోదీ దుష్ప్రచారం చేశారు. బీఆర్ఎస్ పార్టీ బీసీలను మోసం చేసిందంటూ బడుగులను రెచ్చగొట్టేందుకు యత్నించారు. కాగా, బీసీలకు మంత్రి పదవుల్లో పెద్దపీట వేశామని చెప్పి మోదీ.. బీసీ మంత్రిత్వ శాఖ ఎందుకు ఏర్పాటు చేయలేదని బీసీ మేధావులు ప్రశ్నిస్తున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బీసీ నేత బండి సంజయ్‌ను పక్కకు పెట్టి కిషన్‌రెడ్డికి పదవి ఎలా ఇచ్చారని నిలదీస్తున్నారు.

హైదరాబాద్, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ): 'బహుజన హితాయ.. బహుజన సుఖాయ' నినాదాన్ని విధానంగా స్వీకరించి బడుగులకు గొడుగుపట్టింది బీఆర్ఎస్. అధికారం అందని ద్రాక్షగా మారిన బీసీ వర్గాలకు అత్యున్నత శిఖరాలపై నిలబెట్టింది కేసీఆరే. పీసీసీ అధ్యక్షులుగా పనిచేసినా.. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాల ఏర్పాటులో క్రియాశీల పాత్ర పోషించిన బీసీలను అణచివేసిందనేది జగమెరిగిన సత్యం. ప్రధాని మోదీ బీసీ అని చెప్పుకోవటానికి తహతహలాడుతున్న బీజేపీది కండ్ల ముందటి చిత్రమే. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్న బీసీని తీసి.. తాము అధికారంలోకి వస్తే బీసీనే ముఖ్యమంత్రిని చేస్తానని బీజేపీ ప్రకటించి మరీ తనను బీసీ వ్యతిరేకి అని చెప్పకనే చెప్పింది. అదే బీఆర్ఎస్ పార్టీ అటు ప్రభుత్వంలో, ఇటు పార్టీలో బీసీలను అక్కున చేర్చుకొని అవకాశాలు కల్పించిందని లెక్కలే చెప్తున్నాయి. పార్టీ పదవులైనా.. ప్రభుత్వ పదవులైనా బీసీ వర్గాలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ బీఆర్ఎస్ బడుగుల భారత సమితిగా ప్రత్యేక గుర్తింపు పొందింది. ఉమ్మడి రాష్ట్రంలో విపక్షంలో ఉన్నా స్వరాష్ట్రంలో రెండు దఫాలు అధికారాన్ని కొనసాగిస్తూ బీసీ వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ముందుకు సాగుతున్నది. బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ 2004లో ప్రముఖ బీసీ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య, రాష్ట్ర ప్రస్తుత బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావును వెంటబెట్టుకొని నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్‌ను కలిసి కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఉండాలని డిమాండ్ చేశారు. దేశంలో 54శాతం బీసీల జనాభా ఉన్నదని విద్య, ఆర్థిక, సామాజిక భద్రత, జీవన ప్రమాణాల పెంపే లక్ష్యంగా పనిచేయడానికి ప్రత్యేక మంత్రిత్వశాఖ ఉండాలని పట్టుబట్టారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం బీసీ వర్గాలకోసం 154 కార్యక్రమాలను అమలు చేస్తామని ప్రకటించిందని, వీటిని అమలు చేయాలంటే బీసీ మంత్రిత్వశాఖ ఉండాలని స్పష్టంచేశారు.

బడుగులకు బీఆర్ఎస్ గొడుగు

ఆదినుంచీ బీఆర్ఎస్ పార్టీ బడుగులకు గొడుగుగా నిలిచింది. బడుగుల ఆత్మగౌరవాన్ని సమున్నతంగా నిలిపిన పార్టీగా బీఆర్ఎస్‌కు పేరున్నది. రాజ్యసభ, లోక్‌సభ, శాసనమండలి, శాసనసభ చట్టసభలతోపాటు రాష్ట్రస్థాయి కార్పొరేషన్లు, స్థానిక సంస్థలు, మార్కెట్ కమిటీలు, దేవాలయ కమిటీలు, గ్రంథాలయ కమిటీల్లో బీసీలకు బీఆర్ఎస్ పార్టీ సింహభాగం అవకాశాలు కల్పించింది. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావును నియమించినా, హరీశ్‌రావు, కేటీఆర్ ఎమ్మెల్యేలుగా ఉన్నా.. బీసీ నాయకుడైన ఈటల రాజేందర్‌ను పార్టీ శాసన సభాపక్షనేతను చేసినా, రాష్ట్ర ఆవిర్భావం అనంతరం ఏర్పాటైన తొలి ఆర్థికశాఖ (నంబర్ 2)ను బీసీ అయిన ఈటల రాజేందర్‌కే అప్పగించినా.. ఆ ఘనత కేసీఆర్‌కే దక్కింది. జీహెచ్ఎంసీ, గ్రేటర్ వరంగల్ మేయర్ ఈ రెండు జనరల్ స్థానాల్లోనూ బొంతు రామ్మోహన్ మొదటిసారి, రెండోసారీ గద్వాల విజయలక్ష్మికి అవకాశం కల్పించారు. గ్రేటర్ వరంగల్‌లో గుండు సుధారాణికి అవకాశం ఇచ్చారు. జీహెచ్ఎంసీ, జీడబ్ల్యూఎంసీ రెండు జనరల్ క్యాటగిరీలకు చెందిన బీసీ మహిళలకు బీఆర్ఎస్ పార్టీ అవకాశం కల్పించింది . తెలంగాణ తొలి శాసనమండలి, శాసనసభ సారథులుగా బీసీ వర్గాల ప్రతినిధులైన స్వామిగౌడ్, సిరికొండ మధుసూదనాచారికి అవకాశం కల్పించారు. ప్రస్తుత శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా పద్మారావుగౌడ్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌గా బండా ప్రకాశ్‌కు అవకాశం కల్పించిన విషయం తెలిసిందే. నాయకత్వ లక్షణాలున్నవారిని ఎంపిక చేసి మరీ సీఎం కేసీఆర్ వారిని ఆయా రంగాల్లో రాటుతేలేలా చేశారు.

సంఖ్యాపరంగా తక్కువే అయినా సగౌరవస్థానం

వెనుకబడిన వర్గాల్లోని జనాభా తక్కువగా ఉన్న సామాజికవర్గాల్లోని అణిముత్యాలను వెలికితీసి వారికి సముచిత గౌరవాన్ని కల్పించిన పార్టీగా బీఆర్ఎస్ రికార్డు సృష్టించింది. ప్రత్యక్ష రాజకీయాల్లో నేరుగా తలపడే శక్తి ఉన్నా అనేకానేక సమీకరణాలను దృష్టిలో ఉంచుకొని వెనుకబడిన వర్గాల్లో మరీ 'వెనుకబడిన'సామాజిక వర్గాలను సీఎం కేసీఆర్ అక్కున చేర్చుకొని అవకాశాలు కల్పిస్తున్నారు. కర్నె ప్రభాకర్, నారదాసు లక్ష్మణ్‌రావులాంటి వారికి ఎమ్మెల్సీ పదవులు ఇచ్చినా, బీసీ కమిషన్ చైర్మన్‌గా వకుళాభరణం కృష్ణమోహన్‌రావును నియమించినా.. ఈ ఎన్నికల్లో ఇబ్రహీంలోడికి ఎమ్మెల్యే అవకాశం కల్పించినా, రాష్ట్రస్థాయి కార్పొరేషన్లకు చైర్మన్లుగా నందికంటి శ్రీధర్, మఠం భిక్షపతి ఇలా ఎంతోమంది జనాభాతక్కువ ఉన్న వర్గాలకు బీఆర్ఎస్ పార్టీ అక్కున చేర్చుకొని, ఆదరించి అవకాశాలు కల్పించటం తెలిసిందే.

ఎంపీలుగా అవకాశాలు పొందిన బీసీ నేతలు

- కే కేశవరావు (మున్నూరుకాపు, పార్టీ సెక్రటరీ జనరల్, పార్లమెంటరీ పార్టీ నేత)
- బడుగుల లింగయ్యయాదవ్ (యాదవ, రాజ్యసభ)
- వద్దిరాజు రవిచంద్ర (మున్నూరుకాపు, రాజ్యసభ)
- బీబీ పాటిల్ (లింగాయత్, ఎంపీ)

ఎమ్మెల్సీలుగా..

- సిరికొండ మధుసూదనాచారి (విశ్వకర్మ)
- బండా ప్రకాశ్ (ముదిరాజ్, ఎంపీ, ఎమ్మెల్సీ, శాసనమండలి డిప్యూటీ చైర్మన్)
- బస్వరాజు సారయ్య (రజక)
- వీ గంగాధర్‌గౌడ్ (గౌడ)
- శంభీపూర్ రాజు (మున్నూరుకాపు)
- దండే విఠల్ (మున్నూరుకాపు)
- యెగ్గె మల్లేశం (కుర్మ)
- ఎల్ రమణ (పద్మశాలి)

జీహెచ్ఎంసీ, జీడబ్ల్యూఎంసీ మేయర్లుగా : బీసీ (మహిళకు)

- మున్సిపల్ చైర్మన్లుగా : 55
- వైస్ చైర్మన్లుగా : 42
- జిల్లా పరిషత్ చైర్మన్లుగా: 9

ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా అవకాశం పొందిన బీసీ వర్గానికి చెందిన నాయకులు

- వీ శ్రీనివాస్ గౌడ్ (గౌడ, మంత్రి, మహబూబ్‌నగర్)
- గంగుల కమలాకర్ (మున్నూరుకాపు, మంత్రి, కరీంనగర్)
- తలసాని శ్రీనివాస్‌యాదవ్ (యాదవ, మంత్రి, సనత్‌నగర్)
- టీ పద్మారావు (గౌడ, మంత్రి, డిప్యూటీ స్పీకర్, సికింద్రాబాద్)
- దాస్యం వినయభాస్కర్ (మున్నూరుకాపు, వరంగల్ పశ్చిమ, ప్రభుత్వ చీఫ్‌విప్)
- బాజిరెడ్డి గోవర్ధన్ (మున్నూరుకాపు, ఆర్టీసీ మాజీ చైర్మన్, నిజామాబాద్ రూరల్)
- జోగు రామన్న (మున్నూరుకాపు, ఆదిలాబాద్)
- దానం నాగేందర్ (మున్నూరుకాపు, ఖైరతాబాద్)
- నన్నపునేని నరేందర్ (మున్నూరుకాపు, వరంగల్ ఈస్ట్)
- నోముల భగత్ (యాదవ, నాగార్జునసాగర్)
- ముఠా గోపాల్ (గంగపుత్ర, ముషీరాబాద్)
- బొల్లం మల్లయ్యయాదవ్ (యాదవ, కోదాడ)
- కేపీ వివేకానందగౌడ్ (గౌడ, కుత్బుల్లాపూర్)
- అంజయ్యయాదవ్ (యాదవ, షాద్‌నగర్)
- జైపాల్ యాదవ్ (యాదవ, కల్వకుర్తి)
- చింతా ప్రభాకర్ (పద్మశాలి, సంగారెడ్డి)
- జాజుల సురేందర్ (మున్నూరుకాపు, ఎల్లారెడ్డి)
- వనమా వెంకటేశ్వర్‌రావు (మున్నూరుకాపు, కొత్తగూడెం)
- కోరుకంటి చందర్ (మున్నూరుకాపు, రామగుండం)
- పుట్టా మధు (మున్నూరుకాపు, మంథని)
- కాలేరు వెంకటేశ్ (వంజర, అంబర్‌పేట)
- టీ ప్రకాశ్‌గౌడ్ (గౌడ, రాజేంద్రనగర్)
- ఇబ్రహీంలోడి (దూదేకుల, చార్మినార్)

రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్లుగా అవకాశాలు పొందిన బీసీలు

- అల్లం నారాయణ (పెరిక, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్)
- వీ ప్రకాశ్ (మున్నూరుకాపు, రాష్ట్ర జలవనరుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్)
- నాగుర్ల వెంకటేశ్వర్లు (ఆర్యక్షత్రియ, రైతు రుణవిమోచన కమిషన్ చైర్మన్)
- జూలూరి గౌరీశంకర్ (విశ్వకర్మ, బీసీ కమిషన్ సభ్యులు, సాహిత్య అకాడమీ చైర్మన్)
- పిట్టల రవీందర్ (ముదిరాజ్, మత్స్య సహకారాభివృద్ధి సంస్థ చైర్మన్)
- వకుళాభరణం కృష్ణమోహన్‌రావు (దాసరి (ఎంబీసీ), రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్)
- అనిల్ కూర్మాచలం (చాత్తాద శ్రీవైష్ణవ, రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్)
- మఠం భిక్షపతి (జంగం, రాష్ట్ర బ్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్)
- పల్లె రవికుమార్ (గౌడ, కల్లుగీత సహకార సంస్థ చైర్మన్)
- నందికంటి శ్రీధర్ (మేదరి, ఎంబీసీ కార్పొరేషన్ ప్రస్తుత చైర్మన్)
- అరుణకుమారి (ముదిరాజ్, టీఎస్‌పీఎస్సీ సభ్యులు)
- సుమిత్రా ఆనంద్ (ఆర్యక్షత్రియ, టీఎస్‌పీఎస్సీ సభ్యులు)
- ఆర్ సత్యనారాయణ (పద్మశాలి, టీఎస్‌పీఎస్సీ సభ్యులు)
- చింతా ప్రభాకర్, (పద్మశాలి, రాష్ట్ర చేనేత అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్)
- కే విప్లవ్‌కుమార్ (మున్నూరుకాపు, అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్)
- కిశోర్ గౌడ్ (గౌడ, బీసీ కమిషన్ సభ్యులు)
- ఉపేంద్ర (విశ్వకర్మ, బీసీ కమిషన్ సభ్యులు)
- శుభప్రదపటేల్ (లింగాయత్, బీసీ కమిషన్ సభ్యులు)
- దూదిమెట్ల బాలరాజుయాదవ్ (యాదవ, గొర్రెలు, మేకల అభివృద్ధి సంస్థ కార్పొరేషన్)
- ఆంజనేయగౌడ్ (గౌడ, బీసీ కమిషన్ సభ్యులు, శాక్స్ చైర్మన్)
- మెట్టు శ్రీనివాస్ (రాష్ట్ర రోడ్లు, భవనాల అభివృద్ధి సంస్థ చైర్మన్)
- గూడురు ప్రవీణ్ (పద్మశాలి, రాష్ట్ర టెక్స్‌టైల్ కార్పొరేషన్ చైర్మన్)
- గెల్లు శ్రీనివాస్‌యాదవ్ (యాదవ, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్)
- రవీందర్‌సింగ్ (బీసీ, రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్)



బీజేపీ బీసీ సీఎం నినాదం హాస్యాస్పదం

- ప్రధాని మోదీ వ్యాఖ్యలు అసంబద్ధం
- పార్టీ అధ్యక్షుడిగా ఉన్న బీసీని తొలిగించి ఇప్పుడు ముఖ్యమంత్రిని చేస్తామంటారా?
- మీడియాతో ఎమ్మెల్సీ కవిత

నిజామాబాద్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

నిజామాబాద్, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): బీసీని ముఖ్యమంత్రిగా చేస్తామని బీజేపీ చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉన్నదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. బీసీ సామాజికవర్గానికి చెందిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని మార్చేసి, ఓసీకి పదవి కట్టబెట్టి ఇప్పుడు ముఖ్యమంత్రిగా బీసీని చేస్తామంటే ప్రజలు నమ్ముతారా? అని ప్రశ్నించారు. మంగళవారం ఆమె నిజామాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ పర్యటనలో భాగంగా కేసీఆర్ సర్కారుపై ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు. మోదీ మాట తీరు పూర్తిగా అసంబద్ధంగా ఉన్నదని మండిపడ్డారు. తెలంగాణకు బీజేపీ చేసింది ఏమీ లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. బీజేపీ సబ్ కా సాత్ సబ్ కా వికాస్‌లో తెలంగాణ ప్రస్తావనే లేదని దుయ్యబట్టారు. రాహుల్ గాంధీ కూడా కాంగ్రెస్ భారత్ జోడో యాత్రలో తెలంగాణ ప్రస్తావన చేయలేదని, మన హక్కుల గురించి మాట్లాడలేదని విమర్శించారు. అటువంటి పార్టీలు మనకు అవసరమా? అని ప్రశ్నించారు. ఈ ఏడాది రాష్ట్ర బడ్జెట్‌లో సీఎం కేసీఆర్ బీసీల కోసం రూ.6,200 కోట్లు కేటాయించారని చెప్పారు.

బీఆర్ఎస్ గెలుపును ఎవ్వరూ ఆపలేరు

మైనార్టీల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో చేసిందని ఎమ్మెల్సీ కవిత వివరించారు. గత పదేండ్లలో 204 పాఠశాలలు పెట్టి లక్ష మందికి విద్యను అందిస్తున్నదని చెప్పారు.బీఆర్ఎస్‌తో పోల్చుకునేంత గొప్ప పనులేవీ కాంగ్రెస్ చేయలేదని విమర్శించారు. నిజామాబాద్ అర్బన్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి గణేశ్‌గుప్తాను ప్రజలు ఆదరిస్తారని, బీఆర్ఎస్ గెలుపును ఎవ్వరూ ఆపలేరని చెప్పారు.

కరెంటుపై కట్టుకథలు చెప్పొద్దు

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ఎమ్మెల్సీ కవిత హితవు

హైదరాబాద్, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ): కరెంటు సరఫరాపై కట్టుకథలు చెప్పడం మానేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ఎమ్మెల్సీ కవిత హితవుపలికారు. పెద్దపల్లిలో ఎన్టీపీసీ విద్యుత్తు కేంద్రం ద్వారా తెలంగాణకు ప్రధాని మోదీ ప్రభుత్వం నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా చేస్తున్నదంటూ కిషన్‌రెడ్డి ట్విట్టర్‌లో చేసిన పోస్టుపై ఆమె అదే వేదికగా స్పందించారు. తెలంగాణ విద్యుత్తు పీక్ డిమాండ్ 15,500 మెగావాట్లుగా ఉంటే ఎన్టీపీసీ ద్వారా తెలంగాణకు 680 మెగావాట్లు మాత్రమే సరఫరా అవుతున్నదని తెలిపారు. అంటే తెలంగాణ వినియోగిస్తున్న విద్యుత్తులో పెద్దపల్లి ఎన్టీపీసీ ద్వారా వస్తున్నది నాలుగు శాతం మాత్రమేనని స్పష్టంచేశారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వమే నిరంతర విద్యుత్తును అందజేస్తున్నదంటూ అబద్ధాలను వ్యాప్తిచేయవద్దని సూచించారు. సీఎం కేసీఆర్ కృషి వల్లే తెలంగాణలో కరెంటు కష్టాలు తీరాయని తెలిపారు.

మోదీ.. బీసీలకు చేసిందేంది?

- బీసీ అధ్యక్షుడిని తొలిగించిన ఘనత మీదే
- కుల గణనపై పదేండ్లుగా దొంగాట
- బీసీ మంత్రిత్వ శాఖపై మౌనం

హైదరాబాద్, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ): బీసీలకు పదేండ్లుగా తీవ్ర అన్యాయం చేస్తున్న ప్రధాని మోదీ ఇప్పుడు 'బీసీ సీఎం' హామీ ఇవ్వడం హాస్యాస్పదమని తెలంగాణవాదులు మండిపడుతున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బీసీ బండి సంజయ్‌ని పదవి నుంచి తొలగించిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. అలాంటి పార్టీ ఒకవేళ తెలంగాణలో గెలిస్తే బీసీని ముఖ్యమంత్రి చేస్తామంటే ఎలా నమ్ముతామని ప్రశ్నిస్తున్నారు. బీజేపీ బీసీలకు 36 టికెట్లు మాత్రమే ఇచ్చిందని గుర్తు చేస్తున్నారు. జనాభాకు తగ్గట్టుగా కనీసం సగం టికెట్లు కూడా ఇవ్వని పార్టీ.. సీఎంను ఎలా చేస్తుందని అడుగుతున్నారు. దీంతోపాటు బీసీ కులగణనపై ఎందుకు తాత్సారం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు.

ప్రత్యేక మంత్రిత్వశాఖపై మౌనం

దేశ జనాభాలో 70 కోట్ల బీసీ జనాభా ఉన్నదని, కేంద్రంలో ప్రత్యేకంగా మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌ను ఎందుకు పట్టించుకోవడం లేదని బీసీ సంఘాల నేతలు నిలదీస్తున్నారు. తమకు కావాల్సింది ప్రజా ప్రతినిధుల సంఖ్య కాదని, ప్రజల జీవన స్థితిగతులను మార్చగలిగే మంత్రిత్వశాఖ అడుగుతున్నామని చెప్తున్నారు. మంత్రులుగా బీసీలు ఉంటే ఆయా శాఖలకే పరిమితం అవుతారని, బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఉంటే దేశంలోని 70 కోట్ల జనాభా అభివృద్ధి గురించి ఆలోచించి, పథకాలు అమలు చేస్తారని పేర్కొంటున్నారు. 2014లో తెలంగాణ తొలి శాసనసభ సమావేశాల్లోనే 'బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలి' అని ఏకగ్రీవ తీర్మానం చేసిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. మోదీ బీసీ మంత్రిత్వ శాఖపై ప్రకటన చేసే అవకాశం ఉన్నదంటూ బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ చెప్పారని, అయినా ఎందుకు ప్రకటించలేదని బీసీ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. మెడికల్ కాలేజీలు, డెంటల్ కాలేజీల్లో బీసీలకు సీట్లు ఇస్తున్నామని మోదీ చేస్తున్న ప్రకటనపై తెలంగాణవాదులు మండిపడుతున్నారు. కేంద్రం తెలంగాణకు ఒక్క మెడికల్ కాలేజీ కూడా ఇవ్వలేదని గుర్తు చేస్తున్నారు. ప్రధాని మోదీ తెలంగాణను ఏవిధంగా అభివృద్ధి చేస్తారో చెప్పకుండా కుటుంబ పాలన అంటూ రొడ్డకొట్టుడు ఉపన్యాసాలకే పరిమితం అయ్యారని విమర్శిస్తున్నారు.

కులగణనపై చేతులెత్తేసిన బీజేపీ సర్కార్!

బీజేపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బీసీ కుల గణన చేయాలని డిమాండ్ చేసిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత చేతులు ఎత్తేసిందని పలువురు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. 2018లో కుల గణన చేస్తామని హామీ ఇచ్చి, మూడేండ్లలోనే మాట మార్చిందంటూ దుమ్మెత్తిపోస్తున్నారు. 2021 అక్టోబర్‌లో తెలంగాణతోపాటు అనేక రాష్ట్రాలు 'బీసీ కుల గణన నిర్వహించాలి' అని తీర్మానం చేసి కేంద్రానికి పంపినా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు.

బీజేపీ.. బీసీ సీఎం అంటే నమ్ముతారా..?

- ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో ఆనందంగా బీసీ కులాలు
- బీఆర్ఎస్వీ నేత తుంగ బాలు

హైదరాబాద్, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ): అధికారంలో ఉండి కుల గణన చేయని భారతీయ జనతా పార్టీ బీసీని ముఖ్యమంత్రిని చేస్తామంటే ఎలా నమ్ముతామని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు తుంగ బాలు ప్రశ్నించారు. బీజేపీ బీసీ ఆత్మగౌరవ సభలో బీసీ ముఖ్యమంత్రి అని అన్నారే తప్ప.. బీసీలకు ఏంచేస్తారో ప్రధాని నరేంద్ర మోదీ చెప్పలేదని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదేండ్లలో ఒకసారి జరిగే జనగణనను కూడా చేయని ప్రధానిగా నరేంద్రమోదీ చరిత్రలో నిలిచిపోతారని ఎద్దేవా చేశారు. బీసీల స్థితిగతులపై అధ్యయనానికి ఏర్పాటు చేసిన జస్టిస్ రోహిణి కమిషన్ పరిస్థితి ఏమిటి? అని ప్రశ్నించారు. ముందు ఆ అంశంపై దృష్టి సారించాలని హితవు పలికారు. కేసీఆర్ కుటుంబ పాలన అని విమర్శలు చేసే నరేంద్రమోదీకి వారి పార్టీ నేతల కుటుంబ సభ్యుల రాజకీయ పదవులు, క్రీడల్లో ఉన్న తన్థానాలు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా కొడుకు జైషాకు బీసీసీఐలో పదవి ఎలా వచ్చింది? అని నిలదీశారు. తెలంగాణకు ఒక్క నవోదయ పాఠశాల ఇవ్వడం చేతకాని ప్రధాని.. తెలంగాణ విద్యావ్యవస్థ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉన్నదని అన్నారు. తెలంగాణలో బీసీ కులాలు కేసీఆర్ పాలనలో ఆర్థికంగా, ఆనందంగా ఉన్నాయని చెప్పారు.